క్లుప్తంగా

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



శ్రీవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని రాజేంద్రనగర్‌లో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమంలో పచ్చ కర్పూరంతో ఆలయాన్ని శుద్ధిచేశారు. అనంతరం ఆలయ అర్చకులు శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కోశాధికారి సుధాకర్ గుప్త, సభ్యులు వెంకట్, సుదర్శన్, రవి, వీరా, ప్రవీణ్, నాగభూషణం, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

యాడికి: మండల కేంద్రంలోని అగాపే వృద్ధాశ్రమంలో మంగళవారం కమలపాడు గ్రామానికి చెందిన కాశీవిశ్వనాథ్ తన స్నేహితుడు నాగేంద్రరెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆశ్రమంలోని 20 మంది వృద్ధులకు అన్నదానం ఏర్పాటు చేశాడు. ఆశ్రమ నిర్వాహకుడు బత్తుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్‌గా శివనారాయణ



తాడిపత్రిటౌన్: తాడిపత్రి సబ్‌రిజిస్ట్రార్‌గా శివనారాయణ సోమవారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న బసవరాజు అనారోగ్య కారణాలతో సెలవుపై వెళ్లారు. జిల్లా కేంద్రంలోని డీఆర్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శివనారాయణ డిప్యూటేషన్‌పై ఇక్కడికి బదిలీపై వచ్చారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న అభ్యర్థులు

తాడిపత్రి రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ అంజనేయులును ఎన్నికల్లో పోటీ చేసిన పలువురు అభ్యర్థులు సన్మానం చేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికల విధులను తహసీల్దార్ సమర్థవంతంగా నిర్వహించారన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



ఎమ్మెల్యే జేసి అస్మిత్‌రెడ్డిని కలసిన ఉపాధ్యాయ సంఘాల నేతలు

తాడిపత్రి అర్బన్: 2003 అన్‌ట్రైన్డ్ డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో ప్యాప్టో, ఏపీటీఎఫ్ ఎస్టీయూ తదితర ఉపాధ్యాయ సంఘాల నేతలు ఎమ్మెల్యేను సత్కరించించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఉపాధ్యాయ సంఘాల నేతలు అందజేశారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి డేనియల్, ఏపీటీఎఫ్ తాడిపత్రి మండల ప్రధాన కార్యదర్శి జి.అంకాల్‌యాదవ్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురామయ్య, ఎస్టీయూ కార్యదర్శి చంద్రశేఖర్, యూనియన్ నాయకులు ఓబయ్య, వెంకట్రామిరెడ్డి, వెంకటనారాయణ రెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, కిషోర్ తదితరులు ఉన్నారు.

కుంటెమ్మతల్లికి బోనాలు



బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం కుంటెమ్మతల్లికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సంవత్సరం పంటలు బాగా పండాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

ఆషాఢ మాస ఉత్సవాలు



నగిషీ బిందెలు వితరణ చేస్తున్న దృశ్యం

పామిడి: మండలంలోని గజరాంపల్లిలో ఉన్న సుంకులమ్మ ఆలయంలో మంగళవారం ఆషాఢ మాస ఉత్సవాలు నిర్వహించారు. పూజారి సుధాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా అనంతపురానికి చెందిన హరీష్ దంపతులు అమ్మవారికి అభిషేక జలాలు సమర్పించేందుకు మూడు నగిషీ బిందెలు వితరణగా అందజేశారు.

ఘనంగా పెద్ద సరిగెత్తు

గుత్తి: పట్టణంలోని పీర్ల మకాన్‌ల వద్ద మంగళవారం పెద్ద సరిగెత్తు వేడుకలు నిర్వహించారు. బారే హిమామ్, పగ్గాల, బొడ్డు, చందమామ పీర్ల మకాన్‌ల వద్ద భక్తుల సందడి నెలకొంది. అగ్ని గుండం చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. చక్కెర చదివించారు.

యాడికి: మండల కేంద్రంతో పాటు కోనుప్పలపాడు, రాయలచెరువు, చందన, రామరాజుపల్లె, వేములపాడు గ్రామాల్లో మంగళవారం పెద్ద సరిగెత్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. చందనలో మకాన్ వద్ద పీర్ల స్వాములను ముజావర్లు ఖాజాహుసేన్, చాంద్ భాష, పెద్ద పీరు స్వామి, చిన్న పీరుస్వామి, బొడ్డుపీరు స్వాములతో పాటు మరో 10 పీర్ల స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. పీద్దపీరు స్వామి మాల ధరించిన కుటుంబాల సభ్యులు పానకాన్ని అగ్గి గుండంలో పోశారు. కోర్కెలు నెరవేరిన భక్తులు చక్కెర చదివించారు. ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లతో గ్రామస్తులు మకాన్ ఎదురుగా ఉన్న గుండంలోకి కట్టెలు, మొద్దులు వేసి గుండంను వెలిగించారు. కాగా బుధవారం తెల్లవారుజామున 2గంటలకు పెద్దపీరు. చిన్నపీరు. బొడ్డుపీర్ల స్వాములతో పాటు మరో పది పీర్లను గ్రామోత్సవంను నిర్వహిస్తారు. సాయంత్రం జలధి నిర్వహించనున్నారు.



గుత్తిలో బారే హిమామ్ పీర్ల మకాన్‌లో పూజలు



యాడికి మండలం చందనలో పీర్లు

గార్లదిన్నె: మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి పెద్ద సరిగెత్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో భక్తు లు మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా పీర్ల స్వాములకు పానకాలు సమర్పించడంతోపాటు చక్కెర చదివించారు. అలాగే కట్టెలు, మొద్దులు వేసి గుండం వెలిగించారు.

శింగనమల: మండల కేంద్రంమైన శింగనమలలో మంగళవారం తెల్లవారుజామున పీర్లను ఊరేగించారు. గ్రామంలోని దడెంపూలు చావిడి, ఆసరా కట్ట చావిడి, గొల్లకొండ రాయుడు చావిడిలోని పీర్లకు పూజలు చేశారు. అలాగే చిన్నజలాలపురం, గురుగుంట్ల, గోవిందరాయునిపేట, సోదనపల్లి గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. కార్యక్రమంలో హిందూ–ముస్లింలు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు.



యాడికి మండలం చందనలో అగ్నిం గుండం



నార్పల మండలం గూగూడులో కుళ్లాయిస్వామికి చక్కెర చదివించడానికి భక్తుల తోపులాట



పెద్ద సరిగెత్తు సందర్భంగా గూగూడులో పానకం ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

రేపటి నుంచి కుష్టు వ్యాధి సర్వే

గుత్తి రూరల్/బుక్కరాయసముద్రం: ఈ నెల 18 నుంచి ఆగస్టు 2 వరకూ కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే చేస్తున్నట్లు కుష్టు వ్యాధి నివారణ గుత్తి డివిజన్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గుత్తి మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యులు ప్రవీణ్, దేవేంద్రనాయక్ ఆధ్వర్యంలో సర్వే జరుగుతుందన్నారు. ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ పరీక్షిస్తారన్నారు. అలాగే బుక్కరాయసముద్రం మండలంలోని కొర్రపాడు పీహెచ్‌సీ కేంద్రంలో కుష్టువ్యాధి నిర్మూల కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ ప్రియదర్శిని మాట్లాడుతూ సీహెచ్‌ఓ మోహన్‌బాబు, ఆరోగ్య ఎడ్యుకేటర్ పర్వీన్, డీపీఎంఓ బాలఓబులు, కేశవయ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న అధికారులు

పెద్దపప్పూరు: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సమస్యలను తెలుసుకుని పరిష్కరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీపీ వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమస్యను పరిష్కరించడమే ప్రజా ప్రతినిధులుగా మన కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కవిత, తహసీల్దార్ రాజశేఖర్, ఎంపీడీఓ కవిత, సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాసవీ అమ్మవారికి పూజలు



కలశాలతో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

గుంతకల్లు: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో పూజా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం విశేష కలశాభిషేచరణ పూర్వక భూస్థాపిక శ్రీ చక్ర యంత్ర సహస్రాక్షి దేవత పూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఉదయన్నే రామస్వామి దేవాలయం నుంచి మహిళచే 181 కలశాలతో కన్యకాపరమేశ్వరి ఆలయం వరకూ కేరళ వాయిద్య కళాకారులచే ఊరేగింపుగా చేరుకున్నారు. అనంతరం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళ మండలి అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు జయలక్ష్మి, ముదిగంటి శ్రీదేవి కోశాధికారి వంకదారు గీతా సరస్వతీ, ఆర్యవైశ్య సంఘం నాయకులు గోపా జగదీష్, కందూరి కృపాకర్, మేడా వెంకటేశ్వర్లు, గుంతా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రుక్మిణీ పాండురంగస్వామి బ్రహ్మోత్సవం

పామిడి: పట్టణంలోని పెద్ద విఠోబ, చిన్న విఠోబ ఆలయాల్లో మంగళవారం వేర్వేరుగా రుక్మిణీ పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వరుసగా వారంరోజులు పాటు నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా డబ్బేదార్ ఫిర్కా ఆధ్వర్యంలో పెద్ద విఠోబస్వామి ఆలయంలోని, అలాగే రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో చిన్న విఠోబ దేవాలయంలో రుక్మిణీ పాండురంగ స్వామి విగ్రహాలను శోభాయానంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భక్తిప్రపత్తులతో దేవతామూర్తులను పూజించి, తరించారు. డబ్బేదార్ ఫిర్కా కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, రవీంద్రనాథ్‌రావు, గోందే రాజశేఖర్‌రావు మాట్లాడారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 20న మధ్యాహ్నం 3 గంటలకు సాయంత్రం భావసార క్షత్రియ కులస్తుల సంతర్పణ, 21న సాయంత్రం 7గంటలకు దేవతామూర్తుల దైయిండి రథోత్సవం, 22న సాయంత్రం 7 గంటలకు వసంతోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. 23న మంగళవారం పామిడమ్మకు హారతి ఉంటుందన్నారు.



అలంకరణలో రుక్మిణీ పాండురంగస్వామి విగ్రహాలు

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

శింగనమల: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని కలెక్టర్ వినోద్ కుమార్ సూచించారు. మంగళవారం నార్పల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో హరిత అనంత ప్లాంటేషన్ కార్యక్రమం కింద కలెక్టర్ మొక్కలు నాటారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హరిత అనంత కార్యక్రమం కింద జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా మొక్కలు పెంపకం చేపడుతున్నామన్నారు. అలాగే కేశేపల్లి గ్రామం వద్ద రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. కార్యక్రమంలో డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, ఏపీడీ అనురాధ, ఏపీఓ రమేష్, ఎంపీడీఓ రాముడు, ప్రిన్సిపాల్ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

పామిడి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గుత్తి అటవీశాఖ రేంజర్ ఆఫీసర్ ఎం.మధుబాబు, సెక్షన్ ఆఫీసర్ హెచ్ కరీముల్లా, ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ కృష్ణకుమార్, ఉపన్యాసకులు సతీష్‌కుమార్, రాజేశ్వరి, అటవీశాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలని ఏపీఓ పుల్లారెడ్డి, ఫారెస్ట్ బీట్ అధికారి మాదవి సూచించారు. మంగళవారం ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో మిడుతూరు నుంచి పెద్దవడుగూరు వరకూ రోడ్డుకు ఇరువైపులా 400 మొక్కలు, చిట్టూరు నుంచి నాగలాపురం వరకూ 400 మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

యల్లనూరు: మండలంలోని జంగంపల్లి, కల్లూరు, తిమ్మంపల్లి పంచాయతీల్లో రోడ్డుకు ఇరువైపులా మూడు కిలోమీటర్లు చొప్పున 1200 మొక్కలను నాటినట్లు ఏపీడీ వెంకటరత్నం, ఏపీఓ షబ్బీర్ బాషా తెలిపారు. నాయకులు సుధాకర్‌నాయుడు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



నార్పలలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మొక్క నాటుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

పుట్లూరు: పార్టీలకతీతంగా అందరూ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బి.రాఘవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రామలింగేశ్వరెడ్డి తాగునీటి సమస్యలు ఉన్న గ్రామాలు, వివిధ పథకాల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న గ్రామాల గురించి వివరించారు. అలాగే ట్రాన్స్‌కో ఏఈ విజయుడు, హార్టికల్చర్ అధికారి శైలజ, ఏఓ కాత్యాయని, పీఆర్ ఏఈ యల్లమనాయుడు, పశువైద్యాధికారి నాగసువర్ణ, వైద్యాధికారి శ్రీవాణి తమ శాఖల్లో జరుగుతున్న కార్యక్రమాలను సభ్యులకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి శాఖలో ఉన్న సమస్యలపై తనకు సమగ్ర నివేదిక కావాలన్నారు. గతంలో ప్రతిపాదనలు పంపి మంజూరు కాని వాటి వివరాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సువర్ణ, తహసీల్దార్ మల్లికార్జునస్వామి, ఎంపీడీఓ దస్తగిరి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శింగనమల ఎమ్మెల్యే శ్రావణి

పార్క్‌ను సుందరంగా తీర్చిదిద్దుతాం

గుత్తి: పట్టణంలోని 14వ వార్డులో ఉన్న మున్సిపల్ పార్క్‌ను మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పరిశీలించారు. ఆయనమాట్లాడుతూ పార్క్‌లో కొన్ని ఆట వస్తువులు, పరికరాలు దెబ్బతిన్నాయన్నారు. వెంటనే మరమ్మతులు చేయిస్తామన్నారు. పార్క్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. డీఈ హేమచంద్ర, మున్సిపల్ మేనేజర్ ఇమామ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల యజమానులకు నోటీసులు

గుత్తి మున్సిపాలిటీ పరిధిలో పలు ప్రాంతాల్లో, కూడళ్లలో పశువుల సంచారం అధికమవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు మున్సిపల్ అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు స్పందించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పశువుల యజమానులకు నోటీసులు జారీ చేశామన్నారు. ఇక నుంచి రోడ్లపైకి పశువులు వస్తే యజమానులపై చర్యలు తీసుకోవడంతో పాటు భారీగా జరిమానా విధిస్తామన్నారు. అవసరమైతే పశువులను గోశాలలకు తరలించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.



పార్క్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

యాజమాన్య పద్ధతులు పాటించండి

గుత్తి రూరల్: ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన వేరుశనగ పంటలో యాజమాన్య పద్ధతులను పాటించాలని గుత్తి డివిజన్ ఏడీఏ వెంకట్రాముడు సూచించారు. మంగళవారం మండలంలోని జక్కలచెరువులో ఏడీఏ వేరుశనగ పంటలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఏడీఏ మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ పంట 15 నుంచి 20 రోజుల దశలో ఉన్నాయన్నారు. గతంలో వేసిన పంటలకు వేరు పురుగు ఆశించిందన్నారు. కార్బోఫ్యూరాన్ లేదా ఫోరేట్ గుళికలు 20 గ్రాములు లీటరు నీరు కలిపి సాళ్లలో భూమి తడిచేలా పిచికారి చేయాలన్నారు. గొంగళి పురుగు నివారణకు క్లోరోపైరిఫాస్ ఆరు మిల్లీలీటర్లు ఒక కిలో విత్తనాలకు కలిపి విత్తన శుద్ధి చేయాలన్నారు. కార్బోఫ్యూరాన్ 3జీ లేదా ఫోరేట్ 3జీ ఎకరాకు ఏడు నుంచి 10 కిలోలు విత్తే సమయంలో భూమిలో వేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.



జక్కలచెరువులో వేరుశనగ పంట పరిశీలిస్తున్న ఏడీఏ

ఎర్రమట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

గుంతకల్లు: మండలంలోని ప్రభుత్వ భూముల్లో (డీ పట్టా) అధికారుల కళ్లు గప్పి రాత్రి సమయాల్లో ఎర్రమట్టిని తరలించి జేబులు నింపుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలో నెలకొన్న పలుర కాల సమస్యలపై ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని తిమ్మాపురం, దోనిముక్కల తదితర గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు అక్రమార్కులు ఎర్రమట్టిని టిప్పర్లు ద్వారా తరలిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి.మహేష్, మండల కార్యదర్శి రాము రాయల్, జనసేన సేవాదళ్ రాష్ట్ర నాయకులు మురళీకృష్ణ, నాయకులు రామాంజనేయులు, సయ్యద్ బాషా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు ఎన్‌సీసీ తోడ్పాటు

గుంతకల్లు: ఉత్తమ పౌరులుగా ఎదగడానికి విద్యార్థులకు ఎన్‌సీసీ ఎంతోగానో తోడ్పాటు అందిస్తుందని ఎస్ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ అన్నారు. మంగళవారం ఎన్‌సీసీ క్యాడెట్ ర్యాంకును సీనియర్ అండర్ ఆఫీసర్‌గా మనోజ్‌కుమార్, రెండో క్యాడెట్ ర్యాంక్ జూనియర్ అండర్ ఆఫీసర్‌గా అజయ్, మూడో ర్యాంక్ మాస్టర్ సార్జంట్లుగా పవన్‌కుమార్, దివాకర్, భవానీ ప్రసాద్‌కు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆర్.సురేష్‌బాబు, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ జి.ప్రకాష్, కళాశాల ప్రజా సంబంధాల అధికారి బసెట్టి క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గార్లదిన్నె: మండల కేంద్రం సమీపంలో 44వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి.పోలీసుల వివరాల మేరకు.. యర్రగుంట్లకు చెందిన క్రిష్టారెడ్డి, గార్లదిన్నెకు చెందిన ఆంజనేయులు ద్విచక్రవాహనంలో అనంతపురం వైపు బయలుదేరారు. లోలూరు క్రాస్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి గుర్తు తెలియని ఫార్చునర్ వాహనం ఢీకొని వెళ్లిపోయింది. కిందపడిన ఇద్దరికీ రక్తగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను అనంతపురంఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న శింగనమల పోలీసులు ప్రమాదంపై ఆరా తీశారు.

ప్రభుత్వాస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపరచండి

గుంతకల్లుటౌన్: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్లు, పారామెడికల్ సిబ్బందిని నియమించడంతో పాటు సౌకర్యాలను మెరుగుపరచాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డిని సీపీఎం నాయకులు కోరారు. మంగళవారం సూపరింటెండెంట్‌ను సీపీఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, సీఐటీయూ అధ్యక్షుడు రమేష్ తదితరులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని శ్రీపురం గ్రామ శివారులో మంగళవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడి కంబయ్య అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాలిలా ఉన్నాయి. గుత్తి పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన కంబయ్య పని నిమిత్తం కుమారుడితో కలిసి ద్విచక్రవాహనంలో గుంతకల్లుకు వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని తిరిగి గుత్తికి వస్తుండగా శ్రీపురం గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న వారి ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన కంబయ్యను 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు కంబయ్యను అనంతపురంకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజక్షన్ చేశారు..ప్రాణాలు కాపాడారు

గుత్తి: గుత్తి ప్రభుత్వాస్పత్రికి గుండెపోటుతో వచ్చిన రోగికి తక్షణమే ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాపాయం నుంచి కాపాడారు. వివరాలు.. నంద్యాల జిల్లా డోన్ మండలం కొత్త బురుజు గ్రామానికి చెందిన చిన్న ఓబులేసుకు ఛాతీనొప్పి రావడంతో తెల్లవారు జామున 5.30కు ఆస్పత్రి వచ్చాడు. సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప అతడికి ఈసీజీ చేసి రక్తనాళాలు బ్లాక్ అయినట్లు గుర్తించారు. వెంటనే టెనాక్ట ప్లస్ ఇంజక్షన్ ఇచ్చి అతడి ప్రాణాల కాపాడారు. అనంతరం చిన్న ఓబులేసును కర్నూలుకు తరలించారు. ఇంజక్షన్ రూ.40 వేలు విలువ చేస్తుందని వైద్యులు తెలిపారు. రోగి కుటుంబ సభ్యులు ఆస్పత్రి సూపరిండెంట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ పట్టాలు సృష్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

గుత్తి రూరల్: పట్టణంలో విచ్చలవిడిగా అక్రమ పట్టాల దందా జరుగుతోందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాణా ప్రతాప్ అనే యువకుడు తహసీల్దార్ భారతికి మంగళవారం వినతి పత్రం అందజేశాడు. ఆయన మాట్లాడుతూ పట్టణ శివార్లలోని ప్రభుత్వ భూముల్లో కొందరు పట్టాలు ఇప్పిస్తామని రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకూ అక్రమంగా వసూలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే సుమారు 10 నుంచి 15 దొంగ పట్టాలు సృష్టించి విక్రయించారన్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నాడు.